

సర్దుబాటు చదువులేనా..?
ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీల భర్తీ విషయంలో స్పష్టత కొరవడుతోంది. ఏళ్ల తరబడి ఖాళీలు భర్తీ కాక గందరగోళంగా మారుతోంది. 8లో▸



ఘనంగా హనుమాన్ జయంతి
జిల్లాలో శనివారం హనుమాన్ జయంతి ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
41.4 /28.4

వాతావరణం
ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వేడి, ఉక్కపోత అధికంగానే ఉంటుంది. ఒకటి రెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

లోక్‌అదాలత్‌తో కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ అజయ్ ఉల్లం

సిర్పూర్(టి): పెండింగ్ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకునేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు మేజిస్ట్రేట్ అజయ్ ఉల్లం అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు పరిధిలోని ఎస్సైలతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న కోర్టు పరిధిలో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. క్షిదారులు కేసులు పరిష్కరించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్పీ కరుణాకర్, ఎస్సైలు రమేశ్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

'విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు'

ఆసిఫాబాద్‌అర్బన్: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు అనంతరం జిల్లాలో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతి లేదని ఎస్పీ సురేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం .. లెక్కింపు తర్వాత ర్యాలీలు నిర్వహించడం, టపాసులు కాల్చడం, ఇతర వాటికి అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధితులు సమాచారం అందించాలి
జిల్లాలో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, హింసకు గురైన బాధిత మహిళలు షీటీం సభ్యులు, పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సురేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు, బాలికల రక్షణ కోసం జిల్లాలో షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పని చేస్తున్నాయని పేర్కొన్నారు. షీటీం నంబర్ 87126 70564, డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

యూనిఫాంలు అందజేత



యూనిఫాంలు అందిస్తున్న డీఈవో

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో శనివారం గుండి, ఆసిఫాబాద్ ఉర్దూ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యార్థుల యూనిఫాంలను డీఈవో అశోక్ అందించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు అందించాలన్నారు. ఉపాధ్యాయులు బాధ్యతతో బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, ఏపీఎం శ్రీనివాస్, పరీక్ష నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రగతి బాటలో..

10 వసంతాల తెలంగాణ

- ప్రత్యేక జిల్లా ఏర్పాటుతో చేరువైన పాలన
- పట్టాల పంపిణీతో పోడు భూముల సమస్యకు పరిష్కారం
- ఇప్పుడిప్పుడే మెరుగుపడుతున్న వైద్యసేవలు
- పురోగతి సాధించని సాగునీటి రంగం
- గ్రామీణ ప్రాంతాలకు తీరని రవాణా కష్టాలు
- గడిచిన పదేళ్లలో జిల్లాలో అనేక మార్పులు



జిల్లా కేంద్రంలో గిరిజన రైతులకు పోడు పట్టాలు పంపిణీ చేస్తున్న అప్పటి సీఎం కేసీఆర్

ఆసిఫాబాద్: ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణ ఏర్పడి పదేళ్లయింది. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాగిన మలి దశలో ఉద్యమంలో జిల్లా నుంచి ఉద్యమకారులు ధర్నాలు, రాస్తారోకోలతో హోరెత్తించారు. గోండు బెబ్బులి పేరుతో ఏర్పడిన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో దశాబ్ద కాలంలో అనేక మార్పులు జరిగాయి. నిజాం కాలంలో జిల్లా కేంద్రంగా కొనసాగిన ఆసిఫాబాద్ మళ్లీ జిల్లా కేంద్రంగా.. మున్సిపాలిటీగా మారింది. ఏజెన్సీ ప్రాంతాల్లోనూ మౌలిక వసతుల కల్పన, అభివృద్ధికి బీజం పడింది. పోడు భూములకు ప్రభుత్వం పట్టాల పంపిణీ చేయడంతో జిల్లాలోని గిరిజనులకు మేలు జరిగింది. అయితే ఇదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే. దేశంలో అత్యంత వెనుకబడిన జిల్లాల జాబితాలో కుమురంభీం ఆసిఫాబాద్ ఉండటం ఆందోళన కలిగించే అంశం. జిల్లా ఏర్పాటుతో ప్రతీ పనికి ఆదిలాబాద్‌కు వెళ్లాల్సిన భారం తప్పినా.. చాలా రంగాల్లో పురోగతి ఆశించిన మేర లేదు. గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు, వంతెనలు పూర్తికాక రవాణా వ్యవస్థ అభివృద్ధికి నోచుకోలేదు. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటీఐ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం విద్యావ్యవస్థ మెరుగుపడలేదు.

హైవే.. రయ్ రయ్
రెబ్బెన మండలం రేపల్లెవాడ నుంచి మహారాష్ట్ర సరిహద్దు వాంకిడి మండలం గోయగాం వరకు రూ.1280 కోట్లతో 54 కిలోమీటర్ల జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టారు. 2016లో మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం నుంచి గోయగాం వరకు ఉన్న రాష్ట్రీయ రహదారిని జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేశారు. 94 కిలోమీటర్లను ఎన్‌హెచ్ 363గా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డీబీఎల్ సంస్థ పనులు చేపట్టింది. నాలుగు వరుసల రహదారి పనులు పూర్తవడంతో జిల్లా కేంద్రం నుంచి మంచిర్యాల వరకు రాకపోకలకు మార్గం సుగమమైంది. ప్రయాణికులు కార్లలో మంచిర్యాలకు గంటలోపే చేరుకుంటుండగా.. హైదరాబాద్‌కు సైతం 4.5 గంటల్లో చేరుకుంటున్నారు. మరోవైపు గ్రామీణ రవాణా వ్యవస్థ మాత్రం ఇప్పటికీ మెరుగుపడలేదు. రూ.8.5 కోట్లతో నిర్మిస్తున్న గుండి బ్రిడ్జి పదేళ్లుగా పునాదులకే పరిమితమైంది. రూ.3 కోట్లతో నిర్మిస్తున్న ఆసిఫాబాద్- తిర్యాణి రోడ్డు ఐదేళ్లుగా పూర్తి కావడం లేదు.

'పోడు' రైతులకు భరోసా
దశాబ్దాలుగా పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు అందించి భరోసా కల్పించింది. గతేడాది జూన్ 30న జిల్లాకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి జిల్లా నుంచే పోడు పట్టాల పంపిణీ ప్రారంభించడం విశేషం. సుమారు 47 వేల ఎకరాల పోడు భూమికి హక్కు పత్రాలు అందజేశారు. అయితే ఇప్పటికీ జిల్లాలో పోడు భూములకు సంబంధించి రైతులు, అటవీశాఖ మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. రెవెన్యూ, అటవీభూముల గుర్తింపునకు ఉమ్మడి సర్వేలు చేపట్టడంలో జాప్యం జరుగుతుండటంతో ఏటా వానాకాలం సీజన్ ప్రారంభంలో గొడవలు జరుగుతున్నాయి.

మున్సిపాలిటీగా ఆసిఫాబాద్ పట్టణం
ఆసిఫాబాద్ ప్రజల చిరకాల కల నెరవేరింది. జిల్లా కేంద్రం పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారింది. ఆసిఫాబాద్, జన్కాపూర్, గొడవెల్లి గ్రామాలతో ఆసిఫాబాద్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ గత ఫిబ్రవరి 2న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 3,831 ఎకరాల విస్తీర్ణం (17.02 చదరపు కిలోమీటర్లు), 16,597 మంది జనాభా కలిగిన ఆసిఫాబాద్ పురపాలిక సంస్థలో మొత్తం 20 వార్డులు ఏర్పాటు చేయనున్నారు.

వైద్యం మెరుగు



ప్రభుత్వ వైద్యకళాశాల

ఉమ్మడి రాష్ట్రంతో పోల్చితే ప్రత్యేక రాష్ట్రంలో జిల్లాలో వైద్యం రంగం ఎంతో పురోగతి సాధించింది. జిల్లా కేంద్రంలో గతేడాది సెప్టెంబర్ 15న కొత్తగా 45 గదులతో మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారు. వైద్య కళాశాలకు అనుబంధంగా జిల్లా కేంద్రంలోని 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని 300 పడకల స్థాయికి అప్‌గ్రేడ్ చేస్తున్నారు. ఇక్కడే డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో 57 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే ప్రభుత్వ ఆస్పత్రిలో రెగ్యులర్ వైద్యులు లేకపోవడంతో సేవలకు ఇబ్బందిగా మారింది. సూపరింటెండెంట్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.

'భగీరథ' అంతంతే..
స్వచ్ఛమైన తాగునీటి సరఫరా కోసం ప్రారంభించిన మిషన్ భగీరథ పథకం ఆది నుంచి విమర్శలు ఎదుర్కొంటోంది. మిషన్ భగీరథ పథకం కింద ఆసిఫాబాద్ మండలం మానిక్‌గూడ సమీపంలో 1, 2 ఫేజ్ ద్వారా రూ.1650 కోట్లతో నీటి శుద్ధి కేంద్రాలు నిర్మించారు. 1,151 ఆవాసాలకు తాగునీరందించాల్సి ఉంది. రూ.115 కోట్లతో 115 ఎంఎల్‌డీ మరో నీటిశుద్ధి కేంద్రం నిర్మించగా.. ఇక్కడి నుంచి పది మండలాలకు నీటి సరఫరా చేయాల్సి ఉంది. ధనోరా వద్ద 12, 30 ఎంఎల్‌డీ నీటిశుద్ధి కేంద్రం నుంచి ఐదు ఏజెన్సీ మండలాలకు తాగునీరందించాలని నిర్ణయించారు. 1746 కిలోమీటర్ల పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. మిషన్ భగీరథ (ఇంట్రా విలేజ్) కింద 1144 ఆవాసాలకు రూ.22406.74 లక్షల నిధులు మంజూరు చేశారు. దీని కింద 1233.90 కిలోమీటర్ల పొడవునా పైప్‌లైన్ మంజూరు చేశారు. 2021 ఆగస్టు నాటికి పథకం పూర్తి చేయాల్సి ఉండగా.. నేటికీ అనేక గ్రామాలు, పట్టణంలోని పలు కాలనీలకు తాగునీరందని పరిస్థితి.

హంగులతో భవనాలు.. చేరువైన సేవలు



జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం

జిల్లా కేంద్రంలో నూతన హంగులతో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. రూ.52.20 కోట్లతో అద్భుతమైన ఆకృతితో 22 ఎకరాల స్థలంలో జీ+2 పద్ధతిన 1.39 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కలెక్టరేట్ నిర్మించారు. ఈ భవనంలో 37 శాఖల కార్యాలయాలు ఏర్పాటు చేయడంతో ప్రజలకు అన్ని సేవలు ఒకేచోట లభిస్తున్నాయి. జిల్లా పోలీసు కార్యాలయాన్ని 18 ఎకరాల్లో సుమారు రూ.25 కోట్లతో 45వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ+3 పద్ధతిలో నిర్మించారు. ఇక్కడ 50 వరకు విశాలమైన గదులు ఉన్నాయి. గతేడాది జూన్ 30న మాజీ సీఎం కేసీఆర్ అట్టహాసంగా సమీకృత కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే జిల్లా ఏర్పడి ఎనిమిదేళ్లవుతున్నా వివిధ శాఖలు ఇన్‌చార్జీలతోనే కాలం వెల్లదీస్తున్నారు. రెగ్యులర్ అధికారులను నియమించకపోవడంతో 50 శాతం సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏళ్లుగా ఖాళీలు భర్తీ చేయడం లేదు. ఇక్కడ పని చేసే అధికారులు కూడా మంచిర్యాల, కాగజ్‌నగర్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

అందని సాగునీరు



కుమురంభీం ప్రాజెక్టు

గడిచిన పదేళ్లలో సాగునీటి రంగంలో మాత్రం ఆశించిన అభివృద్ధి జరగలేదు. ప్రధాన ప్రాజెక్టుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో పొలాలకు సాగునీరు చేరడం లేదు. పది టీఎంసీల సామర్థ్యంతో కుమురం భీం ప్రాజెక్టు పదేళ్ల కిందట నిర్మించగా.. ఆనకట్ట కుంగి ప్రమాదకరంగా మారింది. నిధులు లేక కాల్వలు నిర్మించ లేదు. 45 వేల ఎకరాల ఆయకట్టు కలగానే మారింది. కాలువల లైనింగ్ చేపట్టకపోవడంతో పూడుకుపోయాయి. డిస్ట్రిబ్యూటరీల కోసం భూసేకరణ చేపట్టాల్సి ఉంది. 15 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించాల్సిన జగన్నాథ్‌పూర్ నిర్మాణ గడువు ముగిసి 18 ఏళ్లు దాటిపోయింది. పనులు పూర్తి కాలేదు. ఒక్క ఎకరాకూ నీరందలేదు. కౌటాల మండలం తుమ్మిడిహెట్టి సమీపంలోని ప్రాణహిత నదిపై చేపట్టిన ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ మరణానంతరం ఆగిపోయింది. బదులుగా వార్ధా నదిపై బ్యారేజీ నిర్మాణం కోసం సర్వే చేసినా పనులు ప్రారంభం కాలేదు. కాంగ్రెస్ సర్కారు మాత్రం ప్రాణహిత ప్రాజెక్టు నిర్మిస్తామని హామీ ఇవ్వడంతో జిల్లా ప్రజలు ఆశతో ఉన్నారు.

అధిక ధరలకు విత్తనాలు అమ్మితే చర్యలు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



షాపులో తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: విత్తనాలను అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట గ్రామంలోని ఫర్టిలైజర్ షాపును శనివారం తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ షాపులో విత్తనాలు, ఎరువుల ధరల పట్టికను అందుబాటులో ఉంచాలన్నారు. నిల్వ స్టాక్, విక్రయించిన స్టాక్ వివరాలను ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రైతులు లూజుగా విక్రయించే విత్తనాలు తీసుకోవద్దని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ దేశ్‌పాండే శ్రీనివాస్, ఏవో ఖాదర్ హుస్సేన్, ఏఈవో చిరంజీవి తదితరులు ఉన్నారు.

డ్యూయల్ డెస్కులు, గ్రీన్‌చాక్ బోర్డు అందిస్తాం
మండలంలోని చిర్రకుంట పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పరిశీలించారు. పనులు తుది దశకు చేరుకోవడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నచిన్న మరమ్మతులు కూడా వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలకు అవసరమైన డ్యూయల్ డెస్కులు, గ్రీన్‌చాక్ బోర్డు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎస్‌వో భరత్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో మనుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇటిక్యాల పహాడ్ గ్రామస్తులతో చర్చలు

- మరో 200 హెక్టార్లు స్వాధీనం చేసుకునేందుకు అటవీశాఖ చర్యలు



గ్రామస్తులకు వివరాలు తెలియజేస్తున్న అధికారులు

సిర్పూర్(టి): మండలంలోని ఇటిక్యాల పహాడ్ అటవీ ప్రాంతంలో ప్లాంటేషన్ ఏర్పాటు దిశగా అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు గ్రామస్తులతో శనివారం అటవీశాఖ అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చలు జరిపారు. గ్రామస్తులు సాగు చేసుకుంటున్న భూమి పూర్తిగా అటవీశాఖ పరిధిలోకి వస్తుందని, ఇప్పటివరకు 200 హెక్టార్లను స్వాధీనం చేసుకుని ప్లాంటేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ఏడాది మరో 200 హెక్టార్లను స్వాధీనం చేసుకుని ప్లాంటేషన్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని గ్రామస్తులకు వివరించారు. రికార్డుల ప్రకారం గ్రామంలోని వంద కుటుంబాల జీవనోపాధి కోసం మూడెకరాల చొప్పున వదిలేసి, మిగితా భూమిలో ప్లాంటేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పగా.. మొత్తం 200 కుటుంబాలకు భూమి కేటాయించాలని స్థానికులు విన్నించారు. అడ ప్రాజెక్టులో భూములు కోల్పోయి పరిహారం, పునరావాసం పొందిన వారికి మళ్లీ భూములు కేటాయించడం కుదరదని అధికారులు స్పష్టం చేశారు. 400 ఏళ్లుగా నివాసం ఉంటున్న వారికి మాత్రమే పరిహారం అందుతుందని పేర్కొన్నారు. గ్రామంలో చర్చించుకున్న తర్వాత నిర్ణయం తెలియజేస్తామని గ్రామస్తులు చెప్పడంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమావేశంలో ఎఫ్ఎస్‌వోలు మోహన్‌రావ్, సంతోష్, తిరుపతి, భానేష్, తులసీదాస్, ఎఫ్‌బీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఉదయం 8.45 గంటలకు జిల్లా కేంద్రంలోని అమర వీరుల స్మారక స్తూపం వద్ద పుష్పగుచ్ఛం సమర్పించి నివాళులర్పించనున్నారు. ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ వద్ద జాతీయ పతాకావిష్కరణ, 9.05 గంటలకు పోలీసు గౌరవ వందనం స్వీకరణ, 9.10 గంటలకు జిల్లా ప్రగతిపై ప్రసంగించనున్నట్లు డీఆర్వో లోకేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.



దశాబ్దికి ముస్తాబు

చిరువ్యాపారులపై ఎండదెబ్బ



నిర్మానుష్యంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ రోడ్డు

- నిప్పుల కొలిమిని తలపిస్తున్న జిల్లా
- ఉక్కపోత, వేడితో బయటకు రాని జనం
- నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు
- అమ్మకాలు సాగక చితికిపోతున్న చిరువ్యాపారులు

ఆసిఫాబాద్‌అర్బన్: దంచికొడుతున్న ఎండలతో జిల్లా నిప్పుల కొలిమిని తలపిస్తోంది. తీవ్రమైన ఎండకుతోడు ఉక్కపోతతో ప్రజలు సతమవుతున్నారు. భానుడి ప్రతాపానికి జనం ఇళ్ల నుంచి బయటికి రావాలంటేనే జంకుతున్నారు. జన సంచారం లేక జిల్లా కేంద్రంలో చిరువ్యాపారాలు చితికిపోతున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు వేచి చూసినా కొనేవారు లేక దిగాలు చెందుతున్నారు. జిల్లాలో నాలుగైదు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్ పైనే నమోదవుతున్నాయి. ఇటీవల కుంచవెల్లిలో 46.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఇక శనివారం కాగజ్‌నగర్‌లో 44.3 డిగ్రీలు, వంకులంలో 43.7, తిర్యాణిలో 43.5, ఆసిఫాబాద్‌లో 43.5, వాంకిడిలో 43.3 డిగ్రీలుగా నమోదైంది. తీవ్రమైన వేడికి జిల్లా కేంద్రంలో రహదారులన్నీ ఉదయం 8 గంటల నుంచే నిర్మానుష్యంగా మారుతున్నాయి. రహదారుల పక్కన చిరువ్యాపారులు చేసుకునేవారికి గిరాకీ ఉండటం లేదు. వారికి ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో సాయంత్రం వరకు ఎండలోనే మగ్గుతున్నారు. కేవలం జ్యూస్, కూల్‌డ్రింక్ సెంటర్లు, కొబ్బరిబోండాలు, తాటిముంజల దుకాణాల వద్ద మాత్రమే జనాల సందడి కనిపిస్తోంది.

వ్యాపారం సాగడం లేదు



ముదిరిన ఎండలకు గిరాకీ కావడం లేదు. ప్రతిరోజూ రెబ్బెన మండలంలోని ఎడవల్లి గ్రామం నుంచి దోసకాయలు, వేరుశనగ కాయలు, నిమ్మకాయలను ఆసిఫాబాద్‌కు తీసుకువచ్చి వ్యాపారం చేస్తుంటా. ఎండలకు అనుకున్నంతగా వ్యాపారం సాగడం లేదు. దినమంతా కూర్చుంటే తెచ్చిన సరకులు పూర్తిగా అమ్ముడుపోవడం లేదు. ఇల్లు గడవడం కష్టమవుతుంది. చిరువ్యాపారుల ఇబ్బందులు దూరమయ్యేలా ప్రభుత్వం ఆలోచించాలి.

– లక్ష్మి, ఎడవల్లి, మం.రెబ్బెన

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



అసలే ఆర్టీసీ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో గిరాకీలు లేక ఆర్థికంగా చతికిల పడ్డాం. దానికి తోడు ఎండలకు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. ఒక్కోరోజు కనీసం రూ.వంద కూడా రావడం లేదు. ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. డ్రైవర్లు కుటుంబాలకు పోషించుకోలేక కొందరు వృత్తి మానేస్తున్నారు.

– అబ్దుల్ సమీర్, ఆటో డ్రైవర్, ఆసిఫాబాద్

వేడి తట్టుకోలేకపోతున్నాం



రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి మాది. ఉదయాన్నే పట్టణంలో ముగ్గు పిండి, రంగులు విక్రయిస్తే రోజుకు రూ.300 నుంచి రూ.400 ఆదాయం వస్తుంది. పెరిగిన ఎండలకు గిరాకీ కావడం లేదు. ఇంట్లో ఉందామంటే పూట గడవని పరిస్థితి. వారం రోజులుగా ఇట్లనే అవుతుంది.

– రేఖ, చిరువ్యాపారి

పక్కా షెడ్లు నిర్మించాలి



ఎండాకాలం, వర్షాకాలంలో వ్యాపారాలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం చిరువ్యాపారాలు చేసుకొనే వారికి ప్రత్యేక షెడ్లు నిర్మించి ఇవ్వాలి. తాగునీటి సౌకర్యం కల్పించాలి. ప్రభుత్వాలు మారినా మా బతుకులు మాత్రం మారడం లేదు. ఎండలో ఎండుతూ, వర్షానికి తడుస్తూ జీవనం సాగించాల్సి వస్తోంది.

– లింగక్క, చిరువ్యాపారి, అంకుసాపూర్

గిరాకీ లేదు



అసలే మంచి రోజులు కావు. శుభ ముహూర్తాలు లేవు. దీనికి తోడు మండుతున్న ఎండలు.. గిరాకీలు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. పొద్దున రోడ్డు పక్కన టైలర్ పనులు ప్రారంభిస్తే సాయంత్రం వరకు కనీసం రూ.200 కూడా గిరాకీ అవుతలేవు. పొద్దంతా ఎండలో పని చేస్తుంటే ఎప్పుడు ఏమవుతుందోనని భయమేస్తుంది.

– సునీత, టైలర్, ఆసిఫాబాద్

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

లింగాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి, మరమ్మతులు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులతోపాటు యూనిఫాం కుట్టు పనులను పరిశీలించారు. యూనిఫాం స్టిచ్చింగ్ బాగుందంటూ మహిళా సంఘాల సభ్యులను మెచ్చుకున్నారు. ఈ నెల 5లోగా కుట్టు పని పూర్తి చేయాలని సూచించారు. డీఈవో అశోక్, ఎంపీడీవో రామేశ్వర్, ఎంపీవో ఉమర్ షరీఫ్, ఎంఈవో సుధాకర్, ఏపీఎం దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుడుంబా స్థావరాలపై దాడులు



నాటుసారాతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

నెన్నెల: మండలంలోని ఆవుడం గ్రామ శివారులో గుడుంబా స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్సై లచ్చన్న తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గుడుంబా స్థావరంపై దాడిచేసి వెయ్యి లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 11 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారు చేస్తున్న ముప్పిడి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వడదెబ్బతో వృద్ధురాలు మృతి



మాటేటి లక్ష్మి(ఫైల్)

భీమారం: మండల కేంద్రానికి చెందిన మాటేటి లక్ష్మి(80) శుక్రవారం రాత్రి వడదెబ్బతో మృతి చెందింది. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఒక్కసారిగా కింద పడిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు 108లో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



మృతి చెందిన చుక్కల దుప్పి

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని అనుకోడ అటవీ ప్రాంతంలో శనివారం కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందినట్లు ఎఫ్ఆర్వో రమాదేవి తెలిపారు. కుక్కలు వేటాడి దాడి చేయడం వల్లనే చుక్కల దుప్పి మృతి చెందిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు. పంచనామానా చేసి దుప్పిని ఖననం చేసినట్లు తెలిపారు.



ఉమ్మడి జిల్లాలో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల ఖాళీల వివరాలు

జిల్లా	స్కూల్ అసిస్టెంట్	లాంగ్వేజ్ పండిట్	పీఈటీ	ఎస్జీటీ	స్కూల్ అసిస్టెంట్ (ప్రత్యేక)	ఎస్జీటీ (ప్రత్యేక)	మొత్తం
నిర్మల్	70	04	04	236	05	23	342
ఆదిలాబాద్	74	14	02	209	06	19	324
మంచిర్యాల	70	16	03	176	05	18	288
కుమురంభీం	62	25	02	234	03	15	341

సర్దుబాటు చదువులేనా..?

- విద్యావలంటీర్ల ఊసే లేనివైనం
- పది రోజుల్లో పాఠశాలలు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏటా కోట్లాది రూపాయలతో మధ్యాహ్నం భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ఇదంతా బాగానే ఉన్నా ఉపాధ్యాయ ఖాళీల భర్తీ విషయంలో స్పష్టత కొరవడుతోంది. ఏళ్ల తరబడి ఖాళీలు భర్తీ కాక గందరగోళంగా మారుతోంది. ఈ ఏడాది మరో పదిరోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం గతేడాది మాదిరిగానే ఉపాధ్యాయులను డిప్యూటేషన్ చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో మంచిర్యాల జిల్లాలో 136 మంది ఉపాధ్యాయులకు వర్క్ అడ్జస్ట్ పేరిట విధులు కేటాయించి సర్దుబాటు చేసింది. ఇంతవరకు రిలీవ్ చేయలేదు. మరోసారి టీచర్ల సర్దుబాటుతోనే చదువులు తప్పేలా లేదు.

ఖాళీల మాటేమిటో..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చదువులపై ప్రభావం చూపకుండా ఏటా టీచర్ల సర్దుబాటు చేస్తున్నారు. ఎస్ఏల బదిలీలు అయినా రిలీవ్ కాకపోవడం.. పీజీహెచ్ఎంలుగా పదోన్నతులు పొంది వెళ్లిపోయిన స్థానంలో ఖాళీలు మిగిలిపోయాయి. వివిధ కారణాలతో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయి. జిల్లాలో బయోసైన్స్, సోషల్, హిందీ టీచర్ల కొరత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఖాళీలు ఎక్కువగా ఉండగా 136 మంది ఉపాధ్యాయులను తాత్కాలికంగా సర్దుబాటు చేస్తే మిగిలిన ఖాళీలపై తేల్చాల్సి ఉంది.

వీవీల ఊసేది..

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో విద్యావలంటీర్ల (వీవీ) నియామకం ఉంటుందా అనే చర్చ సాగుతోంది. 2019–20 విద్యా సంవత్సరంలో చివరిసారిగా జిల్లాలో విద్యావలంటీర్లు సేవలందించారు. తర్వాత కరోనాతో రెండేళ్లు మూతబడడం... ఆతర్వాత కాలంలో ప్రభుత్వం వారి నియామకంపై దృష్టి సారించలేదు. గతంలో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో కొన్నిచోట్ల ఒకరి నుంచి ఇద్దరు ఉపాధ్యాయులతో సర్దుబాటు చేశారు. 89 ఏకోపాధ్యాయ పాఠశాలల్లో వీవీలు లేకపోవడంతో టీచర్లు పడుతున్న బాధలు వర్ణనాతీతం. దీంతో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్న పాఠశాలల్లో సరైన బోధన లేక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. దీని ప్రభావం ఫలితాలపై పడుతోంది. ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేసే వరకు వీవీలను నియమించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చదువుకు ఆటంకం లేకుండా చర్యలు

విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా చర్యలు చేపడుతాం. గతేడాది వర్క్అడ్జస్ట్‌మెంట్ కింద ఆయా పాఠశాలలకు కేటాయించిన టీచర్లను రిలీవ్ చేయలేదు. వీవీల నియామకంపై ప్రభుత్వం నుంచి ఇంకా ఉత్తర్వులు రాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే వాటి ప్రకారం చర్యలు చేపడుతాం.

– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

కాసిపేట 1గనిపై అవగాహన సమావేశం



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు

కాసిపేట: మందమర్రి ఏరియాలోని కాసిపేట 1గనిపై శనివారం ఫ్యాటల్ ఫ్రీ జూన్ 2024 ప్రత్యేక భద్రత అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్షణ అధికారి సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ కార్మికుడు చేసే పనివలన తనతో పాటు తోటి ఉద్యోగులకు సైతం ఎలాంటి ప్రమాదం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ మాట్లాడుతు రక్షణ లేని బొగ్గు ఉత్పత్తి ముఖ్యం కాదని కార్మికుల రక్షణ, శ్రేయస్సు ధ్యేయమన్నారు. ఉత్పత్తి పేరిట అధికారులు కార్మికులను వేధిస్తే ఊరుకునేది లేదని, ఏఐటీయూసీ కార్మికులకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేనేజర్లు నిఖిల్, వెంకటేశ్వర్లు, ఇంజనీర్ మధుకర్, అండర్ మేనేజర్ సుమన్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ రంజిత్, హెడ్‌ఓవర్‌మెన్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

నస్పూర్: ఉద్యోగులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి సూచించారు. శనివారం ఫాటల్ ఫ్రీ జూన్ 2024 ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆర్‌కే 7 గనిపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 30 వరకు ప్రత్యేక భద్రత అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కే 7 గ్రూపు ఏజెంట్ రాముడు, గని మేనేజర్ ఎస్.శ్రీధర్, అధికారులు అమర్నాథ్ రెడ్డి, రవిశంకర్‌వత్స, ప్రవీణ్‌కుమార్, జగదీశ్వర్ రావు, రవీందర్, సంతన్, తదితరులు పాల్గొన్నారు.

'గెలిచిన సంఘాల గుర్తింపు రద్దుచేయాలి'



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నాయకులు

మందమర్రిరూరల్: సింగరేణి గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు గెలిచి ఆరు నెలలు కావస్తున్నా గుర్తింపు పత్రాలు పొందలేదని, వాటిని రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు బడికెల సంపత్, ఓ.రాజశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం గుర్తింపు ఇవ్వడం లేదని గెలిచిన యూనియన్లు కాలయాపన చేయడం సరికాదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, సీఎల్‌సీ జోక్యం చేసుకోవాలని సూచించారు. గుర్తింపు పత్రాలు పొందకపోవడం వలన యాజమాన్యం కార్మిక సమస్యలపై ఎలాంటి నిర్మాణాత్మక సమావేశాలు నిర్వహించడం లేదని, దీంతో కార్మిక సమస్యలు పేరుకుపోతున్నాయన్నారు. సింగరేణి నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు అన్ని కార్మిక సంఘాలను ఆహ్వానించాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్, టీబీజీకేఎస్ నాయకులు వీరారెడ్డి, రాంచందర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అస్తిత్వం దక్కింది... ఆశలే నెరవేరాలి

- రాష్ట్ర సాధనలో సింగరేణి పాత్ర అజరామరం
- నిధులు పెరిగాయి..నియామకాలు రావాలి
- డిపెండెంట్ ఉద్యోగాల హక్కు పునరుద్ధరణ



గోషిక మల్లేశ్, సింగరేణి ఉద్యోగి, జేఏసీ కన్వీనర్

శ్రీరాంపూర్: తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికుల పాత్ర అజరామరం... ఎన్నో కార్మికోద్యమాలకు పురిటిగడ్డ అయిన సింగరేణి తెలంగాణ సాధన కోసం జరిగిన మహోద్యమానికి మరింత ఆయువునిచ్చింది. సకల జనుల సమ్మె కంటే ముందే కార్మికులు తెలంగాణ కోసం సమ్మెలు చేసిన చరిత్ర ఉంది. బొగ్గు బాయిలను బంద్ చేసి బొగ్గు పెళ్లను కూడా బయటికి రాకుండా దక్షిణాదిన కరెంట్ లేకుండా చేసి ఢిల్లీకి ఉద్యమ సెగ చూపించారు. సాక్షాత్తూ నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ నోట సింగరేణి ఉద్యమ ప్రస్తావన వచ్చింది. ఎన్నో త్యాగాలతో తెలంగాణ సాధించుకుని నేటికి పదేళ్లు అవుతోంది. పదేళ్లకు ముందు, తర్వాత సింగరేణిలో భారీ మార్పులు వచ్చాయని నాటి సింగరేణి ఉద్యోగి, జేఏసీ కన్వీనర్ గోషిక మల్లేశ్ తెలిపారు. దశాబ్ది ఉత్సావాల సందర్భంగా ఆయనతో 'సాక్షి' ఇంటర్వ్యూ...

ప్రశ్న: పదేళ్లలో కార్మికులకు ఒనగూరింది ఏమిటి?

జవాబు: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత సింగరేణిలో అనేక మార్పులు వచ్చాయి. సింగరేణి సొంత అస్తిత్వంతో మనుగడ సాధిస్తోంది. ఉద్యోగాల్లో స్థానికులకే అవకాశం కల్పిస్తున్నారు. ముఖ్యంగా బంద్ అయిన డిపెండెంట్ ఉద్యోగాలు కారుణ్య ఉద్యోగాల పేరుతో తిరిగి ఇప్పించడం గొప్ప మైలురాయిగా చెప్పవచ్చు. ఇందులో కొంత అవినీతిని రూపు మాపాల్సిన అవసరమైతే ఉంది. ఉద్యోగులకు తెలంగాణ స్పెషల్ ఇంక్రిమెంట్, విద్యుత్‌చార్జీల మాఫీ, సొంతింటికి రూ.10 లక్షల వడ్డీ రీయింబర్స్‌మెంట్, ఇంకా అనేక హక్కులు, సదుపాయాలు ఈ పదేళ్లలో వచ్చాయి. నాడు కార్మికులు ఏదేని ప్రమాదంలో చనిపోతే నష్టపరిహారాల కోసం మృతదేహాలతో ధర్నాలు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు సంస్థ రూ.కోటి వరకు పరిహారం అందిస్తూ కార్మికుని కుటుంబానికి అండగా నిలబడుతోంది.

ప్రశ్న: ఓసీపీలతో అనర్థమే జరుగుతోంది కదా?

జవాబు: ఓసీపీలు బంద్ పెట్టి భూగర్భ గనులే తవ్వాలనేది తెలంగాణ ఉద్యమంలో ప్రధాన డిమాండ్. కానీ దురదృష్టవశాత్తు తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడ్డ ప్రభుత్వాలు వీటిపై శ్రద్ధ పెట్టడం లేదు. ఉద్యోగాలకు నిలయాలైన భూగర్భగనులే తవ్వాలి. ఓసీపీలు పూర్తిగా బంద్ పెట్టాలి. అప్పుడే ఈ ప్రాంతంలో ఉద్యోగాలతో పాటు పర్యావరణానికి కూడా మేలు జరుగుతుంది.

ప్రశ్న: ఉమ్మడి రాష్ట్రంతో పోల్చితే నేడు సింగరేణిలో ఏం మారింది?

జవాబు: సింగరేణి అస్తిత్వం కాపాడుకున్నాం. ఆత్మగౌరవం పెరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో స్థానికేతరుల అధికార పెత్తనం ఎక్కువగా ఉండేది. ఇప్పుడు అదిపోయింది. నాడు ఆంధ్రలో ఏ విపత్తు వచ్చిన ఇక్కడి కార్మికుల జీతాలు కోత పెట్టి అక్కడికి నిధులు తరలించే వారు. షేప్ నిధులను నేటి పక్క రాష్ట్రానికి తరలించారు. ఉన్నత స్థానాల్లో తెలంగాణ అధికారులు వచ్చారు. సింగరేణి నిధులు నేడు ఈ ప్రాంతంలోనే ఖర్చు అవుతున్నాయి. ఎక్స్‌ట్రనల్ ఉద్యోగ నియామకాల్లో స్థానిక సింగరేణి జిల్లాల వారికే ప్రాధాన్యతనిస్తున్నారు.

ప్రశ్న: ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటికీ పరిష్కారం కాని డిమాండ్లు ఉన్నాయా?

జవాబు: ఉన్నాయి. ఐటీ మాఫీ చేయాలి. తెలంగాణ వస్తే అవుతుందనుకున్నాం. కానీ ఇప్పటికీ కాలేదు. ఉద్యోగుల సంఖ్య తగ్గింది. కొత్త భూగర్భ గనులు రావాల్సి ఉంది. ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం, మైనింగ్ యూనివర్సిటీ డిమాండ్ అలాగే ఉంది. జేఏసీ విజన్ డాక్యుమెంట్‌లో ఇవన్నీ పొందుపర్చి తెలంగాణ మొదటి గవర్నమెంట్‌కు ఇచ్చాం. తెలంగాణాలో ఇంకా కార్మికుల ఆశలు నెరవేరాల్సి ఉంది.

ప్రశ్న: పదేళ్లలో సింగరేణిలో రాజకీయ పరిస్థితులు ఎలా మారాయి?

జవాబు: ఉమ్మడి రాష్ట్రంలో సింగరేణి స్వతంత్ర సంస్థగా ఉండేది. ఇప్పుడు రాజకీయ జోక్యం పెరిగింది. పైరవీలు పెరిగాయి. ఇవి పోవాలి. సంస్థ భవిష్యత్తు దృష్ట్యా ఇలాంటి శుభపరిణామాలు కావు.

అటవీశాఖలో డ్రిల్‌మార్చ్ ప్రారంభం



ఇందనపల్లి రేంజ్‌లో డ్రిల్‌లో పాల్గొన్న ఎఫ్ఆర్వో

జన్నారం: అటవీశాఖ అధికారుల్లో ఆత్మస్థైర్యం నింపి ఆరోగ్య సమస్యలను దూరం చేసేందుకు నూతనంగా పరేడ్, డ్రిల్ కార్యక్రమం చేపట్టారు. టైగర్ ప్రాజెక్టు ఫీల్డ్ అధికారి, సీఎఫ్ శాంతారాం, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్ ఆదేశాల మేరకు శనివారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని అన్ని అటవీ డివిజన్ల పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. ప్రతీనెల 1, 15వ తేదీలలో కార్యక్రమం నిర్వహించాలని ఎఫ్‌డీపీటీ ఆదేశాలు జారీ చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం జన్నారం అటవీ డివిజన్‌లోని ఇందనపల్లి, జన్నారం, తాళ్లపేట్ రేంజ్‌లలో ఉదయం 8 నుంచి తొమ్మిది గంటల వరకు సెల్యూట్, డ్రిల్, పరేడ్, డ్రెస్‌కోడ్, తదితర అంశాలు నిర్వహించారు.

సరికొత్త సైబర్ మోసాలు

- ఇద్దరి ఖాతాల నుంచి నగదు బదిలీ చేయించుకున్న కేటుగాళ్లు
- సైబర్ క్రైంకు ఫిర్యాదు చేసిన బాధితులు



రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలంలో శుక్రవారం సరికొత్త సైబర్ మోసాలు వెలుగులోకి వచ్చాయి. గూగుల్ పే, ఫోన్ పే ఎంపిన్ సెట్ చేయాలని ఫోన్ చేసి ఒకరి ఖాతా నుంచి, ఓటీపీ పంపించి మరొకరి ఖాతా నుంచి కేటుగాళ్లు నగదు బదిలీ చేయించుకున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం .. రెబ్బెన మండల కేంద్రానికి చెందిన పిట్టల సునీత భర్త ప్రభాకర్‌తో కలిసి మిర్చి బండి నడుపుతోంది. 8 నెలలుగా మిర్చి బండి ద్వారా వచ్చిన డబ్బుల నుంచి రోజుకు కొంత మొత్తంగా రూ.50వేల నగదును తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాలో జమ చేస్తోంది. శుక్రవారం సుమారు 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి.. 'మీ ఫోన్‌పే, గూగుల్ పే పిన్ ఎక్స్‌పైర్ అయిందని, వెంటనే సెట్ చేయకపోతే బ్యాంక్ అకౌంట్ బ్లాక్ అవుతుంది' అని హెచ్చరించాడు. మొబైల్‌కు వచ్చే ఓటీపీతోపాటు గూగుల్‌పే, ఫోన్‌పేల ప్రస్తుత ఎంపిన్‌లు చెప్పాలని కోరగా.. ప్రభాకర్ చెప్పేందుకు నిరాకరించాడు. 'ఏ సమస్య ఉన్నా బ్యాంకుకు వెళ్లి పరిష్కరించుకుంటా' అని ఫోన్‌లో చెబుతుండగానే సునీత బ్యాంకు ఖాతాకు గుర్తు తెలియని అకౌంట్ నుంచి రూ.1 క్రెడిట్ అయింది. వెంటనే ప్రభాకర్ టీజీబీకి వెళ్లి విషయాన్ని బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఓటీపీలు, ఎంపిన్‌లు ఎవరికీ చెప్పొద్దని, ఏ సమస్య ఉండదని వారు చెప్పడంతో ఇంటికి చేరుకున్నాడు. కొద్దిసేపయ్యాక ఫోన్ పే తెరవగానే మొదట రూ.25వేలు, మరో రెండు నిమిషాలకు మరో రూ.25వేలు బ్యాంకు ఖాతా నుంచి విత్‌డ్రా అయినట్లు మొబైల్‌కు సందేశం వచ్చింది. మళ్లీ బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా.. మహారాష్ట్రకు చెందిన ఖాతాకు రెండు దఫాల్లో రూ.50 వేలు బదిలీ అయినట్లు అధికారులు తెలిపారు. వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సైబర్ క్రైం పోలీసుకు ఫిర్యాదు చేశాడు. ఎనిమిది నెలలపాటు కష్టపడి దాచుకున్న డబ్బులు సైబర్ నేరగాళ్లు ఒక్క నిమిషంలో ఊడ్చుకెళ్లటంతో భార్యభర్తలిద్దరూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మరోవైపు మండలంలోని నవేగాంకు చెందిన వడాయి హన్మంతురావు మండల సమాఖ్యలో సీసీగా పని చేస్తున్నారు. శుక్రవారం రాత్రి ఫోన్‌పే ఓపెన్ చేయగానే ఆయన ఫోన్‌కు ఓటీపీ వచ్చింది. అనుమానం వచ్చి శనివారం ఉదయం రెబ్బెన తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు వెళ్లి ఖాతాను పరిశీలించగా.. ఖాతా నుంచి రూ.7700 మాయమయ్యాయి. మండల కేంద్రానికి చెందిన పిట్టల సునీత బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు లూటీ చేసిన విధంగానే రెంట్ పేరుతో హన్మంతురావు బ్యాంకు ఖాతా నుంచి మహారాష్ట్రకు చెందిన బ్యాంకు ఖాతాకు ఐఎంపీఎస్ పద్ధతిలో సైబర్ నేరగాళ్లు నగదు బదిలీ చేశారు. 1930 నంబర్‌కు ఫోన్ చేసి హైదరాబాద్‌లోని సైబర్ క్రైంకు ఫిర్యాదు చేశారు.

అటవీ అధికారుల అడ్డగింత

కాగజ్‌నగర్ రూరల్: అంకుసాపూర్ గ్రామ శివారులోని పోడు భూములను శనివారం సర్వే చేసేందుకు వెళ్లిన అటవీశాఖ అధికారులను పోడు రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో రమాదేవి మాట్లాడుతూ పోడు భూములకు సంబంధించిన పట్టాల విషయంలో సర్వే చేస్తున్నామని, పోడు రైతులు సహకరించాలని కోరారు. పలువురు రైతులు మాట్లాడుతూ భూములకు సంబంధించి తమ వద్ద పట్టాలు ఉన్నాయని, రెవెన్యూ అధికారులు సర్వేలు చేసి పట్టాలు ఇచ్చినట్లు వివరించారు.

సేఫ్టీ సమావేశం బహిష్కరణ



సమావేశాన్ని బహిష్కరించిన కార్మికులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో యాజమాన్యం నిర్వహించిన సేఫ్టీ సమావేశాన్ని శనివారం ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు బహిష్కరించారు. డీజీఎం వైఖరికి నిరసనగా సమావేశాన్ని బహిష్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ పిట్ సెక్రటరీ లతీఫ్ మాట్లాడుతూ కార్మికులతో డీజీఎం అనుచితంగా వ్యవహరిస్తున్నాడని, కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా నిరంకుశంగా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్నారు. డ్రైవర్లకు ప్రమోషన్ ఇవ్వకుండా మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్నారు. సమావేశంలో ఆ యూనియన్ నాయకులు తిరుపతిరెడ్డి, ఆర్కాల శ్రీనివాస్, గుండా సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.